క్లుప్తంగా

గాంధీ చిహ్నాన్ని పరిరక్షించాలి



అదనపు ఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ పడమర వీధి గాంధీ మైదానం వద్ద చారిత్రాత్మక స్థలమైన మహాత్మ గాంధీ జ్ఞాన మందిరం వద్ద ఏలూరు నగరానికి చెందిన కొందరు జనసేన కార్యకర్తలు స్థూపం లోగోను నిర్మించారని, జాతిపిత గాంధీ చిహ్నాన్ని భావితరాలకు గుర్తుండేలా దాన్ని పరిరక్షించాలని అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావుకు కాంగ్రెస్ నేతలు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు, మాజీ ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా, దెందులూరు నియోజకవర్గం కోఆర్డినేటర్ ఆలపాటి నరసింహమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి గౌడ రంగబాబు, నగర నాయకులు ప్రతాప సుబ్రహ్మణ్య శర్మ, బ్లాక్ టూ కాంగ్రెస్ అధ్యక్షుడు లంక రామ్మోహన్ ఉన్నారు.

అంగన్‌వాడీలుగా డీఈడీ ట్రైనీస్‌ని నియమించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): గ్రామ స్థాయిలోనే అన్ని అర్హతలు ఉన్న డీఈడీ ట్రైనీస్‌ని, టెట్ పాసైన వారిని అంగన్‌వాడీ టీచర్లుగా కాంట్రాక్టు పద్ధతిలో నియామకాలు చేపట్టాలని నిరుద్యోగ ఏపీ డీఈడీ ట్రైనీస్ అన్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రెసిడెంట్ నేకూరి సతీష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పిల్లలకు అక్షర అంకురం వేసే ఈ దశలోనే వారి విద్యాభ్యాసం సరైన విధంగా కొనసాగడం లేదని, ఇటు విద్యావంతులు అటు తల్లిదండ్రులు కూడా వాపోతున్నారని తెలిపారు. అంగన్‌వాడీల్లో ఆయాలనే టీచర్స్‌గా ప్రమోట్ చేస్తున్నారని, ఈ నియామకాలను నిలుపుదల చేయాలని కోరారు. నూతన అంగన్‌వాడీ విద్యా వ్యవస్థకు అంకురార్పణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఏలూరు జిల్లా కబడ్డీ సంఘం ఎన్నిక

ఏలూరు రూరల్ : స్థానిక కొప్పుల వెలమ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఏలూరు జిల్లా కబడ్డీ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా మరడాని అచ్యుతరావు, కొమ్మంటి రంగారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మేకా రంగారావు, ఉపాధ్యక్షులుగా పిస్ సుధాకర్, అడపా రామకృష్ణ, సంయుక్త కార్యదర్శులు బి.సుబ్రహ్మణ్యం, గంగా చెల్లమ్మ, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా టి.సత్యవతి, టి.శివనాగరాజు ఎన్నికయ్యారని సంఘం కన్వీనర్ అల్లూరి గిరి రాజు వెల్లడించారు. ఎన్నిక ప్రక్రియను ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ వర్కింగ్ అధ్యక్షుడు ఎన్ అర్జున్‌రావు, సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్, రిటైర్డ్ జడ్జి కె.రామారావు పర్యవేక్షించారు.

వినాయక ఉత్సవాలకు ముస్తాబు

- రేపటి నుంచి నవరాత్రి మహోత్సవాలు
- ఏలూరులో భారీ విగ్రహాల ప్రతిష్ఠ
- 6న నిమజ్జనాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆది పూజలు అందుకునే గణపతికి తొమ్మిది రోజుల పాటు భారీ స్థాయిలో ఉత్సవాలు నిర్వహించడానికి ఏలూరు నగరంలో ఏర్పాట్లు చకచకా సాగిపోతున్నాయి. విశ్వావసు నామ సంవత్సర భాద్రపద శుద్ధ చవితి పర్వదినం సందర్భంగా ఈ నెల 27న నగరంలోని ప్రతి డివిజన్‌లో దాదాపు అన్ని వీధుల్లో నవరాత్రి ఉత్సవాలకు కమిటీలు ఏర్పాట్లు చేశాయి. ఏటా మాదిరిగానే ఉత్సవాల నిర్వహణకు పోటీ పడుతున్నాయి. ఒకరిని మించి ఒకరు భారీ విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో, భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖల అధికారులు, యంత్రాంగం ఇప్పటికే నిర్వాహకులకు తగిన సూచనలు చేశాయి.

పందిళ్లు సిద్ధం

నగరంలో ఉన్న 50 డివిజన్లలోనూ నవరాత్రి ఉత్సవాల పందిళ్లు వేస్తున్నారు. వీటికి విద్యుత్ దీపాలంకరణ చేసి, మండపాలను అరటి బోదెలు, మామిడాకులతో విశేషంగా అలంకరిస్తున్నారు. ఇప్పటికే కొన్ని కమిటీలు గణపతి ప్రతిమలను వేదికలపై సిద్ధం చేయగా, మరికొన్ని కమిటీలు మంగళవారం విగ్రహాలను తీసుకురానున్నాయి. 5 అడుగుల నుంచి 12 అడుగుల గణపతి విగ్రహాలను ఆయా పందిళ్లలో ప్రతిష్ఠించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతి నిత్యం స్వామి వారికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు చేయడంతో పాటు స్వామి వారికి నిత్యం ధూప, దీప నైవేద్యాలు సమర్పించడానికి ఏర్పాటు చేసుకున్నారు.

మండపాలకు వస్తున్న విగ్రహాలు

హేలాపురి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 19వ వార్షిక నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏలూరు కుండీ సెంటర్‌లో ఉత్సవాలు నిర్వహించే ప్రదేశంలోనే 24 అడుగుల భారీ మట్టి విగ్రహాన్ని తయారు చేయిస్తున్నారు. రామకోటి ప్రాంగణంలో జై గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 15వ వార్షిక గణపతి నవరాత్రి మహోత్సవాల నిర్వహణకు అదే ప్రాంతంలో 27 అడుగుల ఎత్తున భారీ విగ్రహాన్ని రూపొందిస్తున్నారు. ఎస్ఎస్ కూరగాయల మార్కెట్ వద్ద సైతం పెద్ద ఎత్తున ఉత్సవాలు ఎప్పటిలానే భారీ స్థాయిలో నిర్వహణకు కూరగాయల వర్తక సంఘం ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం భారీ గణపతి విగ్రహాన్ని తీసుకువచ్చి వేదికపై ఏర్పాటు చేశారు.

వైభవంగా ప్రారంభం

ఈ నెల 27వ తేదీ నుంచి గణపతి నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రాంభంకానున్నాయి. తొలి రోజు ఉత్సవాల ప్రారంభం సందర్భంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచన, అఖండ దీపారాధన, కలశ స్థాపనలతో ఉత్సవాలను ప్రారంభిస్తారు. ప్రతి రోజూ భక్తుల గోత్ర నామాలతో విశేష పూజలు చేస్తారు. కొన్ని పందిళ్లలో స్వామి వారికి భారీ లడ్డూలు నివేదన చేయనున్నారు. పెద్ద విగ్రహాలు ఏర్పాటు చేసిన చోట 108 కిలోల భారీ లడ్డూలను స్వామి వారికి నైవేద్యంగా సమర్పించనున్నారు. తొమ్మిది రోజుల పాటు స్వామివారితో పాటు పూజలు అందుకున్న ఈ లడ్డూలను లక్కీ డ్రా నిర్వహించి విజేతలకు అందించడానికి ఉత్సవ కమిటీలు టిక్కెట్లను ఇవ్వడానికి నిర్ణయించారు.

నిమజ్జనాలకు ఏర్పాట్లు

విశేష పూజలు అందుకున్న స్వామి వారి ప్రతిమను సెప్టెంబర్ 6న నిమజ్జనం చేయనున్నారు. వన్‌టౌన్‌లో ఏర్పాటు చేసిన విగ్రహాలను 6వ తేదీన తరలించి తొలుత స్థానిక కుండీసెంటర్‌కు చేరుకుని అక్కడి నుంచి భారీ గణనాథునితో పాటు ఊరేగింపుగా బయలుదేరనున్నాయి. టూటౌన్లో విగ్రహాలు సైతం స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ మీదుగా టవర్ బ్రిడ్జ్ మీద నుంచి పాత బస్టాండుకు, అక్కడి నుంచి నిమజ్జన ప్రాంతమైన తూర్పు లాకులకు చేరుకుంటాయి. నిమజ్జనం కోసం అధికారులు భారీ క్రేన్లు ఏర్పాటు చేయనున్నారు. నిమజ్జనాలు అర్ధరాత్రి వరకూ జరిగే అవకాశం ఉంటుందని యంత్రాంగం చెబుతోంది.



కుండీ సెంటర్‌లో తయారవుతున్న 24 అడుగుల గణపతి మట్టి విగ్రహం



రామకోటి ప్రాంగణంలో తుది మెరుగులు దిద్దుకున్న 27 అడుగుల విగ్రహం



ఎస్ఎస్ కూరగాయల మార్కెట్ వద్దకు చేరిన భారీ గణపతి విగ్రహం

ట్రై సైకిళ్ల పంపిణీ



ట్రై సైకిళ్లు అందజేస్తున్న కలెక్టర్

ఏలూరు(మెట్రో): జిల్లాలో అర్హులైన ప్రతి విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు అందిస్తామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశపు హాలు వద్ద సోమవారం బొర్రా సుధాకరమ్మ, షేక్ ఇస్మాయిల్‌లకు మూడు చక్రాల సైకిళ్లు, ఇద్దరు వృద్ధులు చేతి కర్రలను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి.రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో స్థానిక లంబాడీ తండాలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సోమవారం రాత్రి నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్, ధరావత్ శ్రీనివాస్ నాయక్ బంజారా నాయకుడు, ప్రధానోపాధ్యాయుడు వడిత్య రంగ ప్రసాద్ నాయక్ మాట్లాడుతూ విద్య ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని అన్నారు. చిన్నా నాయక్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మైక్రో ఫైనాన్స్ సంస్థలపై చర్యలకు డిమాండ్



మహాసభలో మాట్లాడుతున్న శ్యామలరాణి

ఏలూరు (టూటౌన్): పేద మహిళలను వేధింపులకు గురిచేస్తోన్న మైక్రో ఫైనాన్స్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి డిమాండ్ చేశారు. స్థానిక పుణ్యమూర్తుల వారి వీధిలో ఉన్న అన్నే అనసూయమ్మ భవనంలో ఐద్వా ఏలూరు నగర మహాసభ పి.హైమావతి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. గత కార్యక్రమాలను సమీక్షించి మహిళా సంఘం అభివృద్ధి, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా శ్యామలారాణి మాట్లాడుతూ ఉపాధి లేక ఆర్థిక అవసరాలు కోసం మహిళలు మైక్రో ఫైనాన్స్ సంస్థలను ఆశ్రయిస్తున్నట్టు చెప్పారు. అధిక వడ్డీలు చెల్లించలేక మైక్రో కంపెనీ వేధింపులు, అవమానాలు, మానసిక క్షోభకు మహిళలు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్, పోలీసులు జోక్యం చేసుకోవాలని కోరారు. తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలకు దిగుతామని తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా నాయుకులు పి.అరుణ కుమారి, జె.హరీషా దుర్గ, రజని, షమీమా తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ ఎం ఫణి కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు టైలరింగ్‌లో 31 రోజులు, జూట్ బ్యాగ్స్ తయారీలో 14 రోజుల పాటు శిక్షణ ఏలూరు, సత్రంపాడులోని తమ సంస్థ కార్యాలయంలో ఈ నెల 28 నుంచి ప్రాంభమవుతందని పేర్కొన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు గల గ్రామీణ ప్రాంత నిరుద్యోగ మహిళలు అర్హులని, శిక్షణా సమయంలో భోజనం, హాస్టల్ వసతి ఉచితమని, శిక్షణ పూర్తి చేసిన వారికి ఉచితంగా టూల్ కిట్టు ఇస్తామని వివరించారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 99485 65256, 95330 79471, 95027 23561లో సంప్రదించాలని సూచించారు.

ఉన్నత లక్ష్యాలను సాధించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని సాధించడం ద్వారా తమ స్వీయ అభివృద్ధితో పాటు దేశాభివృద్ధి చేసే దిశగా కృషి చేయాలని ఏలూరు జిల్లా న్యాయసేవా సాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పత్తేబాద శ్రీ సాయి రాధా మినీ ఫంక్షన్ హాలులో మాతృదేవోభవ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాట్లాడారు. సేవా సంస్థల ఆశయాలను నెరవేర్చాలని విద్యార్థులకు సూచించారు. ట్రస్ట్ చైర్మన్ అబ్బూరి సూర్యనారాయణ మాట్లాడుతూ ఈ సంవత్సరం కొత్తగా విద్యార్థులను సభ్యులు దత్తత తీసుకుని తమవంతుగా ఫీజులు చెల్లించే కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ సందర్భంగా 25 మంది విద్యార్థులకు రూ.4,06,666 ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ట్రస్ట్ కార్యదర్శి కేఎస్‌కే సత్యనారాయణ మాట్లాడారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం చాటపర్రు సెక్షన్ పరిధిలో చాటపర్రు రోడ్డు ఆళ్ల నాని కాలనీ, బాలాజీనగర్ ఏరియా లైన్ మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎస్ అంబేడ్కర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బాల్య వివాహాలతో నష్టాలపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు ఆయన ఏఎస్ఆర్ స్టేడియం వద్ద ఉన్న షెడ్యూల్ తెగల వసతి గృహంలో బాల్య వివాహాలు – వాటి వల్ల కలిగే నష్టాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు వారం రోజుల పాటు బాల్య వివాహాలు, వాటివల్ల కలిగే అనారోగ్య సమస్యలపై అన్ని తరగతుల వారికీ అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని అన్నారు. బాలికలకు 18 ఏళ్లు, బాలురకు 21 సంవత్సరం నిండిన తర్వాతే వివాహం చేయాలన్నారు. అప్పుడే వారు సంపూర్ణ ఆరోగ్యాన్ని కలిగి ఉంటారని వివరించారు. ఎక్కడైనా బాల్య వివాహం చేస్తుంటే టోల్ ఫ్రీ నంబర్లు 1098 లేదా 15100కు తెలియజేయాలని, అలా తెలియజేసిన వారి సమాచారం గోప్యంగా ఉంచుతారని తెలిపారు. ప్రభుత్వం ప్రమాణాలకు తగిన విధంగా విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ ఇన్‌చార్జి చైర్మన్ పి.వెంకటేశ్వరరావు, వార్డెన్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై విస్తృత ప్రచారం చేయాలి



వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ 40వ జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల వాల్‌పోస్టర్‌ను జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధ్యక్షులు, కలెక్టరు కె.వెట్రిసెల్వి విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టరు వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య, మండల కేంద్రాల్లో నేత్రదాన అవగాహన సదస్సులు, ర్యాలీల నిర్వహణకు అన్ని చర్యలు చేపట్టాలన్నారు. కరపత్రాలు, ఫ్లెక్సీలు, ఎలక్ట్రానిక్, ప్రింటు, సోషల్ మీడియా ద్వారా జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారానికి అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్నియాల అవసరం రోజురోజుకు పెరుగుతోందని, దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆగష్టు 25 నుంచి సెప్టెంబరు 08 వరకు జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా నేత్ర దానానికి ముందుకొస్తే అంధుల పాలిట వరమవుతుందని కలెక్టరు ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఉపాధ్యక్షులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పీజే అమృతం, జిల్లా ప్రోగ్రామ్ మేనేజరు పి.మల్లికార్జునరాజు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

పోలవరం రూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు పూర్తిగా హాజరు కాకపోవడంపై ప్రజా ప్రతినిధులు ఎవరికి సమస్యలు విజ్ఞప్తి చేయాలంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలవరం మండల పరిషత్ సమావేశం సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డితో సహా, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమావేశానికి అధికారులు ఎందుకు హాజరు కాలేదంటూ ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబును ప్రశ్నించారు. అందరికీ సమాచారం ఇచ్చామని, రాని వారిపై ఉన్నతాధికారులకు మెమోలు జారీ చేస్తామని తెలిపారు. సమస్యలు పరిష్కరం కానప్పుడు ఎందుకు సమావేశం అంటూ, సమావేశం నుంచి వాకవుట్ చేస్తామని, సమావేశం నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నించగా, ఎంపీడీవో హాజరుకాని అధికారుల విషయంపై చర్యలు తీసుకుంటామని, సమస్యలన్నీ కూడా పరిష్కరించేందుకు కృషిచేస్తానని చెప్పడంతో సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. పలువురు అధికారులు వారు చేపట్టే పనులపై సమావేశంలో వివరించారు. కొంద్రుకోట పంచాయతీ పరిధిలోని నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని ఎంపీటీసీ మాడే ఆనంద్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సచివాలయాల్లో వీఆర్‌వోలు రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అక్కడే ఉన్న తహసీల్దార్ ఆర్ఎస్‌రాజు మాట్లాడుతూ తప్పనిసరిగా వీఆర్‌వోలు సచివాలయాల్లో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో యూరియా కొరత లేకుండా చూడాలని, రైతులందరికీ అందేలా అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. గతంలో కొండ వాగుల ఉధృతికి గండ్లు పడిన కాలువ గట్లు మరమ్మతులకు రూ.46 లక్షలతో ప్రతిపాదనలు పంపామని మైనర్ ఇరిగేషన్ డీఈ వరప్రసాద్ తెలిపారు. అయితే కడెమ్మ కాలువ పూడికతీతకు రూ.5 లక్షలు మాత్రమే మంజూరయ్యాయని, మిగిలిన నిధులు మంజూరైన తరువాత పనులు చేపడతామన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులపై కూటమి కక్ష



పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న బాధితుడు తాతా మాణిక్యాలరావు

పెదవేగి: నిబంధనలకు విరుద్ధంగా పలుమార్లు తనపై వికలాంగ పరీక్షలు చేసి అర్హత ఉందని ధ్రువీకరించినా పింఛన్ ఛన్ ఆపుతామని వేధిస్తున్నారంటూ ఓ విభిన్న ప్రతిభావంతుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మండలంలోని పెదవేగి గ్రామానికి చెందిన బాధితుడు తాతా మాణిక్యాలరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత కొద్ది రోజుల క్రితం జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో వికలాంగ పింఛన్ అర్హత ఉన్నా తనకు పింఛన్ నిలిపి వేశారని ఫిర్యాదు చేయగా, గ్రామ పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్ జడ్జి ముందు హాజరయ్యారన్నారు. ఈ కూటమి ప్రభుత్వంలో వికలాంగ పరీక్షలో మాణిక్యాలరావు అర్హత సాధించారని, పింఛన్ ఇస్తామని కేసు క్లోజ్ చేయించుకున్నారని, ఇప్పుడు మళ్లీ టెస్ట్ చేయించుకోవాలని వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టెస్ట్ చేసి పింఛన్ ఇస్తున్న పెదవేగి వెల్ఫేర్ అసిస్టెంట్, ఎంపీడీఓ రాజకీయ కారణాలతో మరలా టెస్టుకు వెళ్లమని మని వేధిస్తున్నారని వెళ్లకపోతే పింఛన్ ఆగిపోతుందని బెదిరిస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యాడు. దీంతో చేసేదేమి లేక కూటమి ప్రభుత్వంలో ఎన్ని సార్లు టెస్ట్‌కు వెళ్లాలని ఏలూరు కలెక్టరేట్‌లో 3వ సారి పీజీఆర్ఎస్‌లో మాణిక్యాలరావు ఫిర్యాదు చేశాడు. ఇప్పటికైనా నాపై వేధింపులు ఆపి గతంలో మాదిరిగా పింఛన్‌ను కొనసాగించాలని వేడుకుంటున్నాడు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	46	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	30	దిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	34	బిళ్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	30	చామదుంపలు	36
బెండకాయలు	32	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	36	కంద	00
కాకర కాయలు	26-30	బీట్‌రూట్	36
బీరకాయలు	36	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	70-90
క్యారెట్	40-48	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	34	పాలకూర	10
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	10
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	20-24	పుదీనా	05
ఆనబకాయ (1)	20-30	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	20-25	చిలకదదుంప	46

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	34
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	37
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	24
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	31
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	29
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	25
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు - తిరుపతి	16.00	4830	30

దారిని రిజిస్ట్రేషన్ చేశారని ఫిర్యాదు

దెందులూరు: దెందులూరు 3వ వార్డు లైబ్రరీ సెంటర్ సమీపంలో సర్వే నంబర్ 468-1ఇ లో పెంకిటింటికి, 3-158 డోర్ నంబర్‌లో ఉన్న ఇంటికి మధ్యలో ఉన్న 100 గజాల స్థలాన్ని ఎలా రిజిస్ట్రేషన్ చేయిస్తారని శింగర రామచంద్రరాజు ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం మండల సర్వేయర్ రమణారావుపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సమస్య ఉందని మండల సర్వేయర్‌కు ఎన్నో సార్లు చెప్పినా వినకుండా పరిశీలించకుండా 2025 జూన్ 19న సర్వేయర్ కొలతలు వేశారు. తమ ఆస్తి పత్రాలను కూడా సర్వేయర్ పరిశీలించ లేదు. 2025 జూన్ 21న భీమడోలు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్ట్రేషన్ చేశారన్నారు. దీంతో తమ ఇంటికి ఉత్తరం వైపున రాకపోకలను నిలుపుదల చేశారన్నారు. జిల్లా అధికారులు పరిశీలించి తమ సమస్యను పరిష్కరించాలని ఫిర్యాదుదారులు రాజు కోరారు. ఈ విషయమై గ్రామ సర్వేయర్ రవిని వివరణ కోరగా రెండు ఇళ్ల మధ్య ఉన్న దారిని కొలిచానని దెందులూరు గ్రామ సర్వేయర్ రవి అన్నారు. తాను కొలిచిన తరువాత జరిగిన పరిణామాలకు తనకు సంబంధం లేదని వివరణ ఇచ్చారు.

గణపవరాన్ని ఏలూరులో కలపొద్దు



గణపవరాన్ని ఏలూరులో కలపొద్దని ఆందోళన చేస్తున్న అఖిలపక్ష నాయకులు

గణపవరం: మండలాన్ని ఏలూరు జిల్లాలో కలపాలన్న నిర్ణయాన్ని ఏ మాత్రం సహించబోమని, ఈ మండలాన్ని పశ్చిమ గోదావరి జిల్లాలోనే కొనసాగించాలని గణపవరం మండల అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గణపవరం నుంచి అఖిలపక్ష నాయకులు సోమవారం ఏలూరు వెళ్లి జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకుడు పాతపాటి హరికుమార్ రాజు మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లాకు సరిహద్దులోనూ, జిల్లా కేంద్రం భీమవరానికి పది కిలో మీటర్ల దూరంలో ఉన్న గణపవరం మండలాన్ని ఏలూరు జిల్లా నుంచి పశ్చిమ గోదావరి జిల్లాలో కలపాలన్న డిమాండ్ మేరకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగీకరించి, ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయడంతో గణపవరం మండలం పశ్చిమగోదావరి జిల్లాలోకి వచ్చిందన్నారు. దీంతో గణపవరం మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు తమ పనులకు భీమవరం వెళ్లడం చాలా సులభమైందన్నారు. దీనిని ఏలూరు జిల్లాలో కలపాలన్న ప్రయత్నాలు జరుగుతున్నాయని మండల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, ఏలూరు జిల్లాకు గణపవరం మండల గ్రామాలు 100 కిలో మీటర్ల దూరంలో ఉంటాయన్నారు. ఏలూరు వెళ్లాలంటే కనీసం మూడు బస్‌లు మారి, ఎన్నో వ్యయప్రయాసలు పడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు నంద్యాల రామలింగరాజు, ఇందుకూరి రామకృష్ణం రాజు, కూనిరెడ్డి సోమేశ్వరరావు, ఐఎస్‌రాజు, యాళ్లసుబ్బారావు, ఎం.పెంటారావు, కూసంపూడి సురేంద్ర, ముత్యాల వేణు,కె.జగపతి రాజు, జూపల్లి రాజేంద్ర, కవల రాంబాబు, పల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.